చదువు

10

హైదరాబాద్

బుధవారం నవంబరు 15, 2023 ఈనాడు

■ e-mail: edc@eenadu.in

సర్కారీ సాయం ఎలా?

డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నా. చదరంగం పోటీల్లో బహుమతులు గెలుచుకున్నా. కోచింగ్ తీసుకునే స్థోమత లేదు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి ప్రభుత్వ సాయం లభిస్తుందా? – అభిరామ్

■ మీకు చదరంగ క్రీడాకారుడిగా రాణించాలన్న ఆసక్తి ఉంటే, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ వెబ్‌సైట్‌కి వెళ్ళి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తర్వాత ఆ వెబ్‌సైట్ నుంచి చెస్ టోర్నమెంట్‌ల గురించి సమాచారం పొందండి. సంబంధిత రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యాలయాన్ని సందర్శించి మరిన్ని వివరాలు తెలుసుకోండి. మీరు డిగ్రీ చదువుతున్న కళాశాలలో చదరంగ ఛాంపియన్ అయి, యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించే స్థాయికి రావాలి. ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలను మీ కళాశాల వ్యాయామ అధ్యాపకుడి ద్వారా తెలుసుకోండి. ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంటుల్లో పాల్గొని, అక్కడ కూడా ఛాంపియన్ అయి, ముందుగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రానికీ, ఆ తరువాత అంతర్జాతీయ పోటీల్లో దేశానికీ ప్రాతినిధ్యం వహించగల్గితే, అప్పుడు ప్రభుత్వ సాయం లభించే అవకాశం ఉంది. మీరు కనీసం జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తే, స్పాన్సర్లు లభించే అవకాశం ఉంటుంది. స్పాన్సర్లు లభిస్తే, కోచ్‌లు కూడా అందుబాటులో ఉంటారు. అంతవరకు, మీరే కోచ్‌ని ఏర్పాటు చేసుకోవాలి. సాధారణంగా అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాకే ప్రభుత్వ సాయం అందే అవకాశాలు ఉంటాయి. చదరంగం లాంటి క్రీడలకు స్పాన్సర్లు తక్కువగా ఉంటారు. స్పాన్సర్ల సాయం పొందగలిగే స్థాయికి రావాలంటే కనీసం పది సంవత్సరాలు, ప్రభుత్వ సాయం పొందాలంటే ఆ తర్వాత కనీసం మరో ఐదేళ్లు విజయాలు సాధిస్తూనే ఉండాలి. అందుకోసం నిరంతరంగా, ఓపిగ్గా కృషి చేయాలి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

స్టాక్‌మార్కెట్‌లో అవకాశాలివి!

స్టాక్ మార్కెట్.. ఆర్థిక రంగంపై ఆసక్తి ఉన్న వారికి దీని గురించి కచ్చితంగా తెలిసే ఉంటుంది. అయితే పెట్టుబడులు, లాభనష్టాలు మాత్రమే కాదు, ఇందులో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ అవకాశం కల్పిస్తూ కొన్ని ఉద్యోగాలున్నాయి. ఫైనాన్స్, కామర్స్, అకౌంటింగ్.. ఏది చదివిన వారైనా వీటిని ఎంచుకుని చక్కని కెరియర్‌ను నిర్మించుకోవచ్చు.

స్టాక్స్ అంటే ఎక్కువమంది వెంటనే ఆలోచించేది స్టాక్‌బ్రోకర్ల గురించే! కానీ ఇందులో ఇంకా చాలా అవకాశాలున్నాయి. డేటా అనలిటిక్స్, కన్సల్టెన్సీ, రిసెర్చ్ అండ్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్.. ఇలా వివిధ విభాగాల్లో పనిచేయొచ్చు. సరైన శిక్షణ, నైపుణ్యాలతో వీటిని అందుకోవచ్చు. వీటిలో ప్రారంభస్థాయి ఉద్యోగాల గురించి తెలుసుకుందాం.

ఫైనాన్షియల్ అనలిస్ట్

వీరు బ్యాంకులు, పెన్షన్ ఫండ్స్, బీమా కంపెనీలు, ఇతర వ్యాపార సంస్థల్లో పనిచేస్తారు. స్టాక్స్, బాండ్స్, ఇతర పెట్టుబడుల పనితీరును అంచనా వేస్తారు. ఆర్థిక సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం, ఫోర్‌కాస్ట్‌లు ఇచ్చేందుకు ఉపయోగించడం, ఫైనాన్షియల్ మోడల్స్‌ను తయారుచేయడం.. వంటి పనులు చేస్తారు. కంపెనీలు ఎటువంటి ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలన్నా వీరి అవసరం ఉంటుంది. సొంతంగానూ లేదా సంస్థలతోనూ కలిసి పనిచేయొచ్చు.

ఈక్విటీ అనలిస్ట్

ఈక్విటీ అనలిస్ట్‌లు ఒక సంస్థ లేదా స్టాక్ గత పనితీరును గమనించి భవిష్యత్తులో అది ఎటువంటి ప్రదర్శన చూపగలదో అంచనా వేస్తారు. వారి అవగాహన, నైపుణ్యాన్ని ఉపయోగించి పెట్టుబడి నిర్ణయాల్లో సూచనలు ఇస్తారు. కంపెనీలు లేదా క్లైంట్ల స్టాక్స్ ప్రదర్శన ఎలా ఉందో తరచూ గమనిస్తూ ఉంటారు. ఈ ఉద్యోగానికి పరిశోధన నైపుణ్యాలు అవసరం అవుతాయి. విశ్లేషణాత్మకమైన నైపుణ్యాలతోపాటు ఆర్థిక, న్యాయపరమైన అంశాలపై అవగాహన, బిజినెస్ ఇంటెలిజెన్స్ గురించి కనీస పరిజ్ఞానం తప్పనిసరి.

టెక్నికల్ అనలిస్ట్

మార్కెట్‌ను అంచనా వేయడంలో సాంకేతిక అంశాలపై వీరు ఆధారపడతారు. డేటా, టెక్నికల్ ఇండికేటర్లు పరిశీలించి పెట్టుబడి నిర్ణయాలు ఎలా ఉండాలో చెబుతారు. ధరల్లో హెచ్చుతగ్గులను అంచనా వేస్తూ క్లైంట్లకు సహాయకారులుగా ఉంటారు. ఇందుకోసం వీరు వివిధ టూల్స్, ఇండికేటర్లను ఉపయోగిస్తారు.

మార్కెట్ రిసెర్చ్ అనలిస్ట్

వీరు తమ క్లైంట్ లేదా కంపెనీ కోసం పనిచేస్తారు. వినియోగదారుడు, పోటీదారుల వివరాలు సేకరించడం, భద్రపరచడంలో కంపెనీలు మార్కెట్ రిసెర్చ్ అనలిస్ట్‌ల సేవలను అధికంగా ఉపయోగించుకుంటాయి. వీరు సమాచారాన్ని స్టాటిస్టికల్ టెక్నిక్స్, సాఫ్ట్‌వేర్స్ సాయంతో విశ్లేషిస్తారు, అనంతరం కంపెనీలు, వినియోగదారులకు ఉపయోగకరమైన సలహాలు, సూచనలు చేస్తారు. స్టాక్స్ కొనడం, అమ్మడంలో వీరి సలహాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వ్యాపారాల విస్తరణ, ఐపీవోలు (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్) వంటి సందర్భాల్లో వీరు వాణిజ్య సంస్థలకు సహాయకారులుగా ఉంటారు. మార్కెట్ రిసెర్చ్ అనలిస్ట్‌లు తమ పరిశోధన ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలను అభివృద్ధి చేయడంలో సాయపడతారు. చార్టులు, గ్రాఫ్స్, ఇన్ఫోగ్రాఫిక్స్ ఉపయోగించి డేటా ఇన్‌సైట్స్ తయారుచేస్తారు.

డీలర్

వీరు సంస్థల వ్యాపారంలో భాగంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో షేర్లు కొనడం, అమ్మడం, హోల్డ్ చేయడం వంటివి చేస్తారు. డిమాండ్ పెరిగే ముందు అధికంగా షేర్లు కొనుగోలు చేయడం, అధిక డిమాండ్ ఉన్న సమయాల్లో వాటిని అమ్మడం ద్వారా కంపెనీలకు లాభాలు చేకూరుస్తారు. ఇదే పని ట్రేడర్లు కూడా చేస్తారు, అయితే అది వారి వ్యక్తిగత ట్రేడింగ్. కానీ డీలర్లు దీన్ని పెద్ద స్థాయిలో సంస్థల కోసం నిర్వహిస్తారు.

ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెంట్

తమ ఆలోచన, అనుభవంతో క్లైంట్లు సరైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేలా వీరు పనిచేస్తారు. క్లైంట్ ఆర్థిక లక్ష్యాలకు తగిన విధంగా వీరు పెట్టుబడి వ్యూహాన్ని సిద్ధం చేస్తారు. స్టాక్ ధరలు, పనితీరు, కంపెనీ వివరాలు, గత చరిత్ర వంటివన్నీ తెలియజెబుతారు. వీరు వ్యక్తిగత వినియోగదారులతో పాటు బ్యాంకుల వంటి ఆర్థిక సంస్థల కోసం కూడా పనిచేస్తారు. సలహా, ప్రణాళికల్లో వీరిది ప్రధానపాత్ర.

ఫండమెంటల్ అనలిస్ట్

ఫండమెంటల్ అనలిస్ట్‌లు ఒక స్టాక్‌కు సంబంధించి ఏ విషయాన్ని అయినా పూర్తిస్థాయిలో పరిశోధిస్తారు. దాన్ని ప్రభావితం చేయగలిగిన ఏ చిన్నపాటి అంశాన్నీ విడిచిపెట్టకుండా తెలుసుకుని తద్వారా నిర్ణయాలు తీసుకునేందుకు సహాయపడతారు. ఒక కంపెనీకి సంబంధించి స్టాక్, రిస్క్, ఆర్థిక పరిస్థితి, ఎదుగుదల అవకాశాలు, క్యాపిటల్, ఈక్విటీ రిటర్న్, ప్రాఫిట్ మార్జిన్.. ఇలా అన్నీ పరిశీలిస్తారు.

రిస్క్ అనలిస్ట్

ముఖ్యమైన వ్యాపార నిర్ణయాల్లో రిస్క్‌కు సంబంధించి వీరు విశ్లేషిస్తారు. తద్వారా వ్యాపార సంస్థలకు నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడతారు. కంపెనీల తరపున మార్కెట్ ట్రెండ్స్‌ను గమనించడం, క్లైంట్ల గురించి పూర్తిగా తెలుసుకుని వారితో వ్యాపారం చేయడంలో ఉన్న రిస్క్‌లను అంచనా వేయడం, ఒక నిర్ణయం తీసుకోవడంలో ఉన్న మంచిచెడులను విశ్లేషించడం... ఇలా రిస్క్‌తో కూడుకున్న ప్రతి నిర్ణయంలోనూ వీరి పాత్ర ఉంటుంది.

కోర్సులు

- ఎన్ఎస్ఈ (నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్) - దీనికి సంబంధించిన కోర్సులను ఎన్‌సీఎఫ్‌ఎం అంటారు, ఇవి 50 వరకూ అందుబాటులో ఉన్నాయి.
- సెబి (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) - దీనికి సంబంధించిన కోర్సులను ఎన్ఐఎస్ఎం అంటున్నారు, ఇవి 27 వరకూ అందుబాటులో ఉన్నాయి.
- గ్రాడ్యుయేషన్ తర్వాత వీటిలో ఏదైనా ఎంచుకుని చదవొచ్చు. సర్టిఫికేషన్ కోసం పరీక్ష రాసిన అనంతరం ఉద్యోగం కోసం ప్రయత్నించవచ్చు. ఈ పరీక్షలకు ఏం చదవాలో మొత్తం అంతా అధికారిక వెబ్‌సైట్లలో లభిస్తుంది.
- ఈ సర్టిఫికేషన్లు మూడేళ్లపాటు మనుగడలో ఉంటాయి. ఆ సమయం దాటిపోతే మళ్లీ పరీక్ష రాయాలి.
- పైన చెప్పిన కెరియర్లు అన్నింటికి సంబంధించిన కోర్సులు అధికారిక వెబ్‌సైట్లలో లభిస్తాయి. నచ్చిన విభాగాన్ని ఎంచుకుని పరీక్ష రాయవచ్చు.

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్

సంస్థ: ఫిలో **స్టైపెండ్:** నెలకు రూ.15,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 23 **అర్హతలు:** జావాస్క్రిప్ట్, జేసాన్, పైథాన్ రియాక్ట్ జేఎస్ నైపుణ్యాలు ☛ internshala.com/i/d2a782

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: కన్‌స్ట్రక్టివ్ సొల్యూషన్స్ **స్టైపెండ్:** నెలకు రూ.6,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 23 **అర్హతలు:** అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్ కేన్వా, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్ నైపుణ్యాలు ☛ internshala.com/i/41c99d

రుబీ ఆన్ రైల్స్ డెవలప్‌మెంట్

సంస్థ: మేకరబుల్ **స్టైపెండ్:** నెలకు రూ.15,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 23 **అర్హతలు:** సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, పోస్ట్‌గ్రెఎస్‌క్యూఎల్, రెస్ట్, ఏపీఐ, రుబీ ఆన్ రైల్స్, ఎస్‌క్యూఎల్ ☛ internshala.com/i/a455ab

బ్లాగింగ్

సంస్థ: అడిక్టివ్ మీడియా **స్టైపెండ్:** నెలకు రూ.5,000-8,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 23 **అర్హతలు:** బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడంలో నైపుణ్యం ☛ internshala.com/i/3a6ccc

కాస్మాటాలజీ ఎస్ఎంఈ

సంస్థ: గైడోఫీ **స్టైపెండ్:** నెలకు రూ.10,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 23 **అర్హతలు:** కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ నైపుణ్యం ☛ internshala.com/i/0b36d3

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

చండీగఢ్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (పీజీఐఎంఈఆర్) రెగ్యులర్ ప్రాతిపదికన సంగ్రూర్ పీజీఐ, శాటిలైట్ సెంటర్‌లో 10 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగం/ స్పెషాలిటీ: బయోకెమిస్ట్రీ, హెమటాలజీ, ఇంటర్నల్ మెడిసిన్, మెడికల్ మైక్రోబయాలజీ, ఓ అండ్ జీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, రేడియో-డయాగ్నసిస్, రేడియోథెరపీ.
అర్హత: మెడికల్ పీజీ, ఎంఎస్, ఎండీ, డీఎం, పీహెచ్‌డీతో పాటు బోధన/ పరిశోధన అనుభవం. **వయసు:** 50 సంవత్సరాలు మించకూడదు.
దరఖాస్తు రుసుము: రూ.1500. ఎస్సీ/ ఎస్టీలకు రూ.800. **ఎంపిక:** ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా. **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 08.12.2023. **వెబ్‌సైట్:** https://pgimer.edu.in/

ప్రవేశాలు

పీడీఈయూ, గాంధీనగర్‌లో ఎంబీఏ

గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లోని పండిట్ దీనదయాళ్ ఎనర్జీ యూనివర్సిటీ (పీడీఈయూ), స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
1. ఎంబీఏ- ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్
2. ఎంబీఏ- జనరల్ మేనేజ్‌మెంట్
స్పెషలైజేషన్: ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్. **అర్హత:** ఏదైనా డిగ్రీతో పాటు క్యాట్ 2023/ ఎక్స్ఏటీ 2024/ ఎన్‌మ్యాట్ 2023/ మ్యాట్ 2023 స్కోరు. **ఎంపిక:** క్యాట్ 2023/ ఎక్స్ఏటీ 2024/ ఎన్‌మ్యాట్ 2023/ మ్యాట్ 2023 స్కోరు, జీడీ/ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 03-02-2024.
జీడీ/ ఇంటర్వ్యూ: 2024 మార్చి 10 నుంచి 17 వరకు.
వెబ్‌సైట్: https://pdpu.ac.in/

వాక్ ఇన్

రైట్స్ లిమిటెడ్‌లో సైట్ ఇంజినీర్లు

గుడ్‌గావ్‌లోని రైట్స్ లిమిటెడ్- కాంట్రాక్ట్ ప్రాతిపదికన 31 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
1. సైట్ ఇంజినీర్- సివిల్ (ఎర్త్‌వర్క్/ సేఫ్టీ/ ట్రాక్/ బ్రిడ్జ్/ డాక్యుమెంట్ కంట్రోలర్/ కోఆర్డినేషన్/ బిల్డింగ్): 15
2. సైట్ ఇంజినీర్- ఎలక్ట్రికల్ (ఓహెచ్ఈ/ సేఫ్టీ ఎలక్ట్రికల్/ ట్రాక్షన్/ నాన్-ట్రాక్షన్/ ఇన్‌స్పెక్షన్ టెస్టింగ్ కమిషనింగ్): 08
3. సైట్ ఇంజినీర్- ఎస్ అండ్ టీ (సేఫ్టీ ఎస్ అండ్ టీ/ ఇన్‌స్పెక్షన్ టెస్టింగ్ కమిషనింగ్ సిగ్నల్/ టెలికాం): 08
అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ/డిప్లొమాతో పాటు పని అనుభవం.
వయసు: 40 సంవత్సరాలు మించకూడదు.
ఎంపిక: అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.11.2023.
వాక్-ఇన్ ఇంటర్వ్యూ: 22.11.2023.

మరో 3 పోస్టులు

గుడ్‌గావ్‌లోని రైట్స్ లిమిటెడ్- కాంట్రాక్ట్ ప్రాతిపదికన 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
1. సాలిడ్ వేస్ట్ ఎక్స్‌పర్ట్ (డిప్యూటీ): 01
2. వాడిన వేస్ట్ ఎక్స్‌పర్ట్ (సీనియర్/ డిప్యూటీ): 02
అర్హత: పీజీ (ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్)తో పాటు పని అనుభవం.
ఎంపిక: పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.600. ఈడబ్ల్యూఎస్/ ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.300.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.11.2023.
వాక్-ఇన్ ఇంటర్వ్యూ: 01.12.2023.
వేదిక: శిఖర్, ప్లాట్ 1, లీజర్ వ్యాలీ, రైట్స్ భవన్, సెక్టార్ 29, గుడ్‌గావ్, హరియాణా.
వెబ్‌సైట్: https://www.rites.com/Career

రెజ్యూమె.. ప్రాధాన్యం తగ్గుతోందా?

అభ్యర్థులకూ ఉద్యోగాలకూ మధ్య వారధి రెజ్యూమె. ఎటువంటి నియామక ప్రక్రియలో అయిన పోటీలో ఉన్న వారంతా తప్పనిసరిగా తమ రెజ్యూమెలతో ఇంటర్వ్యూలకు హాజరవుతారు. దాన్ని చూసి కంపెనీలు తొలుత ఒక అభిప్రాయానికి వచ్చి, ఆపైన అభ్యర్థిని ఇంటర్వ్యూ చేసి తదుపరి నిర్ణయం తీసుకునేవి. అయితే ఇన్నాళ్లూ నియామకాల్లో ఇంతటి ముఖ్యపాత్ర పోషించిన రెజ్యూమెలకు ఇకపై ప్రాధాన్యం తగ్గనున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

రెజ్యూమెలు ఇక పాతమాటగా మారిపోతాయనడానికి చాలా కారణాలే ఉన్నాయి. ప్రధానంగా వివిధ నియామక సంస్థలు వీటిపై ఆధారపడకుండా ఇంకా ఆధునిక పద్ధతుల్లో అభ్యర్థుల గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. టెక్నాలజీని ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ నుంచి సమాచారం సేకరిస్తున్నాయి. దీనివల్ల నియామక ప్రక్రియ మరింత వేగవంతంగా, సమర్థంగా జరుగుతున్నట్లు సంస్థలు భావిస్తున్నాయి.

▲ ఇది మాత్రమే కాదు.. కొత్తగా రిక్రూటింగ్ ఏజెన్సీలు 'నో రెజ్యూమె: టాలెంట్ సెంట్రిక్ రిక్రూట్‌మెంట్' అనే పద్ధతిని అవలంబిస్తున్నాయి. దీని ప్రకారం కంపెనీలు కొత్తకొత్తగా అందుబాటులోకి వస్తున్న వివిధ డిజిటల్ వనరులను ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నాయి. టాప్ రిక్రూటర్ ఛానెల్స్, ఆన్‌లైన్ పోర్టల్స్, ఎంప్లాయీ రిఫరీలు.. ఇవన్నీ ఇప్పుడు నియామక ప్రక్రియలో భాగమయ్యాయి.

▲ ఈ మార్పునకు ప్రధాన కారణం ఎక్కువమంది అభ్యర్థులు ముందే అందుబాటులో ఉన్న రెజ్యూమె ఫార్మాట్లను వినియోగించడమే అని సంస్థలు చెబుతున్నాయి. ప్రొఫెషనల్ రెజ్యూమె రైటర్ల ద్వారా రాయించడం, చాట్‌జీపీటీ వంటి ఏఐ టెక్నాలజీని ఉపయోగించడం.. వీటికితోడు 80 శాతం మంది తమ రెజ్యూమెలో ఏదో ఒకచోట అబద్ధం చెబుతున్నారని ఒక సర్వేలో తేలింది. ఇదే పదేళ్ల క్రితం ఇలా చెప్పిన వారి శాతం 65గా ఉండేది.

▲ తాజాగా 3 వేల మందికి పైగా రిక్రూటర్లను సర్వే చేస్తే వారు రెజ్యూమేల్లో ఉన్న వివరాలను పూర్తిగా నమ్మబోమని చెప్పారు. నిజానికి ఉద్యోగం ఇచ్చేముందు అభ్యర్థి ప్రవర్తన గురించి ఎక్కువగా తెలుసుకోవాలని అనుకుంటున్నట్లు వారు వివరించారు. కానీ ఆ వివరాలు రెజ్యూమె ద్వారా కేవలం 30 శాతం వరకే తెలిసే అవకాశం ఉండటం వారు మరో ప్రధాన అవరోధంగా భావిస్తున్నారు. అధికశాతం మంది రిక్రూటర్ల సమస్యా పరిష్కారం, నిర్ణయాలు తీసుకునే నేర్పు, నిత్యం నేర్చుకునే ఓర్పు, బృందంతో పనిచేసే మెలకువలు, నాయకత్వ లక్షణాలు ఉన్న అభ్యర్థులను ఎంచుకుంటున్నట్లు వివరించారు. అందువల్ల అభ్యర్థులు కేవలం రెజ్యూమెలపైనే ఆధారపడకుండా ఆన్‌లైన్‌లో తమ పోస్టులు, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

487 ఆరోగ్య కొలువులు

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్' వివిధ నగరాల్లోని వైద్య సంస్థల్లో 487 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. న్యూదిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నైలలో ఈ ఉద్యోగాలు ఉన్నాయి.

ప్రకటించిన పోస్టులకు అభ్యర్థులను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఉద్యోగాలు: రిసెర్చ్ అసిస్టెంట్, టెక్నీషియన్, ల్యాబొరేటరీ అటెండెంట్, ల్యాబొరేటరీ టెక్నీషియన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఫీల్డ్ వర్కర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, లైబ్రరీ క్లర్క్, ఫిజియోథెరపిస్ట్, మెడికల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌రే టెక్నీషియన్, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్, యానిమల్ అటెండెంట్, లైబ్రరీ క్లర్క్, నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్), పారామెడికల్ వర్కర్, వర్క్‌షాప్ అటెండెంట్ మొదలైన 487 పోస్టులు ఆరోగ్యకేంద్రాల్లో ఉన్నాయి. దరఖాస్తు ఫీజు రూ.600. మహిళలకు, ఎసీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజు లేదు.
గరిష్ఠ వయసు ఉద్యోగాన్ని బట్టి మారుతుంది. కొన్ని పోస్టులకు 25 ఏళ్లు, కొన్నిటికి 27 సంవత్సరాలు. మరికొన్నిటికి 30 ఏళ్లుగా నిర్ణయించారు. గరిష్ఠ వయసులో.. ఓబీసీలు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు మూడేళ్లు, ఎస్సీఎస్టీలు, ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పది నుంచి పదిహేనేళ్ల మినహాయింపు ఉంది.

ఏ అర్హతలు?

హెల్త్ ఇన్‌స్పెక్టర్: 70 పోస్టులు ఉన్నాయి. ఏదైనా డిగ్రీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్/ హెల్త్ ఇన్‌స్పెక్టర్/ శానిటరీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ డిప్లొమా పాసవ్వాలి. లేదా పన్నెండో తరగతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్/ హెల్త్ ఇన్‌స్పెక్టర్/ శానిటరీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ డిప్లొమా పాస్ అవ్వాలి. రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. గరిష్ఠ వయసు 30 సంవత్సరాలు.
ఫీల్డ్ వర్కర్: 140 ఖాళీలు ఉన్నాయి. పదో తరగతి పాసైనవారు అర్హులు. గరిష్ఠ వయసు 25 సంవత్సరాలు.
ల్యాబొరేటరీ అటెండెంట్: 69 ఉద్యోగాలు ఉన్నాయి. పదో తరగతి పాసవ్వాలి. మెడికల్ ల్యాబొరేటరీ టెక్నిక్స్/యానిమల్ కేర్/ ల్యాబొరేటరీ యానిమల్ కేర్/ప్రొడక్షన్ ఆఫ్ ఇమ్యునొబయలాజికల్ అండ్ యానిమల్ కేర్/వెటరినరీ ల్యాబొరేటరీ టెక్నాలజీలో ఏడాది ట్రైనింగ్ సర్టిఫికెట్ లేదా ఏడాది డిప్లొమా ఉండాలి. గరిష్ఠ వయసు 27 సంవత్సరాలు.
నర్సింగ్ ఆఫీసర్: 16 పోస్టులు ఉన్నాయి. బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్ పాస్ అవ్వాలి. నర్స్/నర్స్ అండ్ మిడ్‌వైఫ్‌గా రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అవ్వాలి. లేదా జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ డిప్లొమా చేసి రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో నర్స్/నర్స్ అండ్ మిడ్‌వైఫ్‌గా రిజిస్టర్ అవ్వాలి. 50 పడకల హాస్పిటల్‌లో సంవత్సరంపాటు పనిచేసిన అనుభవం ఉండాలి. గరిష్ఠ వయసు 30 సంవత్సరాలు.

పరీక్ష ఎలా ఉంటుంది?

ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది. 60 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకూ 4 మార్కుల చొప్పున కేటాయించారు. ప్రతి తప్పు సమాధానానికీ 1 మార్కు తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. పరీక్ష తేదీని వెబ్‌సైట్, అడ్మిట్‌కార్డుల ద్వారా తెలియజేస్తారు.

❒ ప్రశ్నలు కనీస విద్యార్హతల సబ్జెక్టుల నుంచే వస్తాయి. కాబట్టి సబ్జెక్టుల్లోని ముఖ్యాంశాల మీద పట్టు సాధించాలి. అన్నీ చదివిన విషయాలేనని అశ్రద్ధ చేయకుండా సన్నద్ధత కొనసాగించాలి.

❒ 60 ప్రశ్నలకు 60 నిమిషాల్లోనే సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు నిమిషం వ్యవధి మాత్రమే ఉంటుంది. కాబట్టి సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా వేగంగా గుర్తించగలగాలి. తగిన పరిజ్ఞానం ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. కాబట్టి ఆ దశగా కృషిని కొనసాగించాలి.

❒ రుణాత్మక మార్కులు ఉన్నాయనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. బాగా తెలిసిన ప్రశ్నలకు మాత్రమే సమాధానాలను గుర్తించాలి.